సాక్షి చిత్తూరు

సోమవారం ; 22 ; జనవరి ; 2024



కిటకిటలాడిన బోయకొండ

పవిత్ర పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ దర్శనం కోసం పెద్దఎత్తున భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. - 8లో



రంకెలేసిన కోడెగిత్తలు

వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా జల్లికట్టు దుమ్మురేపింది. - 8లో

నేటి నుంచి స్కూళ్లు పున:ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సెలవుల అనంతరం సోమవారం స్కూళ్లు, విద్యాసంస్థలు పున:ప్రారంభం కానున్నాయి. టీచర్లు సమయానికి పాఠశాలలకు హాజరై బయోమెట్రిక్ నమోదు చేయాలని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు సీతారాముల కల్యాణం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ వరదరాజుల స్వామి ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. భారతీయ సనాతన ధర్మానికి నిలువెత్తు నిదర్శనం శ్రీరాముడు అని అన్నారు. అయోధ్య లో నిర్మించిన నూతన రామాలయంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు బాలరాముల వారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఇక్కడ కల్యాణం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని, గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: జిల్లా కేంద్రం చిత్తూరులో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వ్ (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను కలిసి మాట్లాడవచ్చని పేర్కొన్నారు.

పుంగనూరులో 24, 25 తేదీల్లో ఇస్తిమా



పుంగనూరు: ఇస్తిమా ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న షామియానాలు

పుంగనూరు: పట్టణ సమీపంలోని పుంగనూరు బైపాస్‌రోడ్డులో గల భీమగానిపల్లె వద్ద ఈనెల 24, 25 తేదీల్లో ముస్లింలు ఇస్తిమా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. బెంగళూరుకు చెందిన మతగురువులు మౌలానా ఫరూక్‌సాహెబ్, అక్బర్‌సాహెబ్, ముఫ్తి అస్లాంసాహెబ్, ఎంఎస్.సర్దార్ సాహెబ్‌చే రెండు రోజుల పాటు మత బోధనలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భీమగానిపల్లె వద్ద సుమారు 20 ఎకరాల భూమిని చదును చేసి షామియానాలు ఏర్పాటు చేశారు. ఇస్తిమాకు చిత్తూరు ఉమ్మడి జిల్లాలకు చెందిన సుమారు 50 వేల మంది ముస్లింలు తరలిరానున్నారు. వచ్చిన వారికి ఇబ్బందులు జరగకుండా భోజనం, మంచినీరు, వసతి ఏర్పాట్లను ఇస్తిమా కమిటీ చేపట్టింది. ప్రతిష్టాత్మకంగా ఇస్తిమా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 76,041 మంది స్వామివారిని దర్శించుకోగా 28,336 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.06 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీవారి సేవలో సినీ నటి శ్రియ



శ్రీవారి ఆలయం ఎదుట హీరోయిన్ శ్రియ

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం ప్రముఖ సినీ నటి శ్రియ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందించారు.

అమ్మవారి సేవలో సినీనటి శ్రియ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సినీ నటి శ్రియ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



ప్రసంగిస్తున్న విజయసాయిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే కిలివేటి, ఎన్‌డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి



సాధికార యాత్రకు హాజరైన జనసందోహంలో ఒక భాగం



అతిథులకు గజమాలతో స్వాగతం

సామాజిక జైత్రయాత్ర

ఒక కుటుంబంలో చిచ్చుపెట్టి, బంధాలను చీల్చే కుట్ర రాజకీయాలు... అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అబద్ధపు ప్రచారాలు... చంద్రబాబు, ప్యాకేజీస్టార్ పవన్ కలిసి చేస్తున్న దగాకోరు రాజకీయాలు... ఇవన్నీ ఒక ఎత్తయితే పచ్చ పత్రికలు రాస్తున్న తప్పుడు కథనాలు... టీవీ చానెళ్లలో జగనన్నపై చేస్తున్న దుష్ప్రచారం... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎలాగైనా సరే ముఖ్యమంత్రి పీఠం నుంచి దించాలనే ప్రతిపక్షాల కుతంత్రాలు.. ఇవన్నీ కలిసి రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూస్తుంటే, ప్రజలు మాత్రం జగనన్న వెంటే అంటూ సామాజిక సాధికార యాత్రకు తరలివచ్చిన జనసంద్రం చెబుతోంది. ఇది జైత్రయాత్రలా సాగింది.

- బస్సు యాత్రకు నాయుడుపేటలో నీరాజనం
- పాత బస్టాండ్ ప్రాంతం జనసంద్రం
- మళ్లీ జగనన్నే సీఎం కావాలంటూ నినాదాల హోరు



సామాజిక సాధికార వేదికపై నేతల సంఘీభావం, వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



సూళ్లూరుపేట : నియోజకవర్గంలోని నాయుడుపేట పట్టణంలో ఆదివారం చేపట్టిన సామాజిక సాధికార యాత్రతో పట్టణమంతా జనసంద్రంలా మారింది. గుండెలనిండా జగనన్నపై అభిమానాన్ని నింపుకుని పట్టణ వీధుల్లో జగనన్న సైనికులు కవాతు నిర్వహించినట్టుగా సాగింది సామాజిక సాధికార యాత్ర. సంక్షేమ పథకాల సృష్టికర్త, నిరుపేదల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చిన ఆశాకిరణం, ప్రతి పేదింటికీ పెద్ద కొడుకుగా, తమ్ముడిగా, అన్నగా, మనవడిగా, మామయ్యగా నిలిచిన జగనన్నకు జై అంటూ నినాదాలతో పట్టణం మారుమోగింది.

సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర విజయవంతమైంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి జనం తండోపతండాలుగా తరలిరావడంతోనాయుడుపేట పట్టణంలో జాతరను తలపించింది. ముందుగా పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు విజయగణపతి ఆలయం వద్ద ప్రత్యేక పూజలతో యాత్ర ప్రారంభమైంది. అక్కడి నుంచి గాంధీమందిరం, పార్కు, గడియారం సెంటర్, వెల్‌కమ్ సెంటర్, పెద్ద దర్గామీదుగా పురవీధుల్లో బాణసంచా వేడుకలతో వేలాదిమంది జనం మధ్యన సామాజిక సాధికార ర్యాలీ సాగింది. ర్యాలీ సాగినంత సేపు వైఎస్సార్‌సీపీ నాయకులపై పూలు చల్లి పట్టణ ప్రజలు వారి అభిమానాన్ని చాటుకున్నారు. సాధికార బస్సు యాత్ర సాగుతున్నంత సేపు జై జగన్.. జైజై జగన్ అనే నినాదాలు మిన్నంటాయి. సాధికారయాత్ర పాత బస్టాండ్‌వద్దకు చేరుకోగానే అక్కడే వున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, సావిత్రిభాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభా ప్రాంగణానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన వైఎస్సార్ ప్రతిమకు పూలమాలలు వేశారు. రాజ్యసభ సభ్యులు, రీజనల్ కో–ఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రులు కళత్తూరు నారాయణ స్వామి, అంజాద్‌బాషా, జిల్లా పార్టీ అధ్యక్షులు, వెంకటగిరి ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి పీ అనిల్‌కుమార్ యాదవ్, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ చక్రవర్తి, మేరిగ మురళీధర్, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి లాంటి పెద్దలందరూ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆ తరువాత ముందుగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సభకు అధ్యక్షత వహించి అధ్యక్షోపన్యాసం చేశారు. ఆయన సూళ్లూరుపేట నియోజకవర్గంలో గడిచిన అయిదేళ్లలో రూ.3,470 కోట్లతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేశామన్నారు. సంక్షేమ పథకాల కింద డీబీటీ రూపంలో రూ.1,275 కోట్లు, నాన్ డీబీటీ కింద రూ.7,200 కోట్లు నిరుపేదల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా వెళ్లిందని చెప్పారు. అభివృద్ధికి, సంక్షేమానికి ఇంతకన్నా నిదర్శనం ఏమి కావాలన్నారు. అనంతరం డిప్యూటీ ముఖ్యమంత్రులు నారాయణస్వామి, అంజాద్‌బాషా, మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ ప్రసంగించారు.

బాబులంతా బెంబేలు

అనిల్‌కుమార్ యాదవ్ ప్రసంగిస్తున్నంత సేపు సభా ప్రాంగణమంతా చప్పట్లతో మారుమోగింది. ఇందులో ముఖ్యంగా ''ఇటీవల బాబులు తయారయ్యారంట.. చంద్రబాబు, లోకేష్‌బాబు, కల్యాణ్ బాబు, బాలయ్యబాబులట. ఈ బాబులందరినీ కట్టకట్టుకుని బంగాళాఖాతంలో కలిపేసే రోజు మన ముందుంది. జగనన్న కొట్టే దెబ్బకు ఈ బాబులంతా బెంబేలెత్తిపోవడం గ్యారంటీ.'' అని చెప్పడంతో జనమంతా చప్పట్లు కొట్టి సంఘీభావాన్ని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసి దళితులకు ఒక గౌరవాన్ని తీసుకొచ్చారని అన్నారు. విచ్చేసిన అహుతులందరికీ ఎమ్మెల్యే కిలివేటి శాలువాలు కప్పి బుద్దుడు బొమ్మలను బహూకరించారు. ఈ సభకు అశేష జనం తరలిరావడం విశేషం.



నేతలపై పూల వర్షం



ర్యాలీగా తరలివస్తున్న విజయసాయి రెడ్డి, నారాయణ స్వామి, కిలివేటి సంజీవయ్య, సత్యనారాయణ రెడ్డి



నేతలకు మహిళల అభివాదం



జగనన్న ప్లకార్డులతో అభిమానుల ర్యాలీ

జగమంతా రామమయం

- జిల్లాలో 20 రోజులుగా అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ
- 5 లక్షల మందికి అక్షింతలు అందజేత
- శ్రీరాముడి సేవలో 8,500 మంది



శ్రీరాముడి అక్షింతలను పంపిణీ చేస్తున్న రామ భక్తులు

చిత్తూరు రూరల్: జగమంతా రామనామమే వినిపిస్తోంది. అయోధ్యలో శ్రీరాముడి కోసం నిర్మించిన ఆలయంలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ ప్రతిష్టాత్మకంగా జరగబోతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అయోధ్య రామనామం మార్మోగుతోంది. ప్రతి ఇంటా హరేరామ నామస్మరణ వినిపిస్తోంది. అక్షింతలతో రామబాలుడిని భక్తి శ్రద్ధలతో కొలుస్తున్నారు. విగ్రహ ప్రతిష్ఠ, పూజలను టీవీల ద్వారా వీక్షించేందుకు యావత్ భారతీయులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ప్రతి ఇంటికీ అయోధ్య రాముడి అక్షింతలు చేరాయి. స్వచ్ఛందంగా 8,500 మంది రామ సేవకులు ముందుకు వచ్చి 20 రోజులుగా రామ నామస్మరణను జపిస్తూ అక్షింతలు అందించే ప్రక్రియను పూర్తి చేశారు. విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అక్షింతల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

నేడు బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ

అయోధ్యలో నిర్మించిన రామ మందిరంలో సోమవారం మధ్యాహ్నం బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. ఇందులో భాగంగా వేదపండితులు ముందస్తుగా పెద్దఎత్తున పూజా కైంకర్యాలు చేపట్టి దేశవ్యాప్తంగా స్వామివారి చిత్రపటం, అక్షింతలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈక్రమంలో జిల్లాకు గత నెల కిందటే అక్షింతలు చేరాయి. జిల్లావ్యాప్తంగా ప్రతి ఇంటికీ అక్షింతలు అందాలనే నిర్ణయం మేరకు 20వ తేదీ వరకు అంక్షితలు పంపిణీ చేశారు. ఈ బాధ్యతను విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ తీసుకున్నాయి. అక్షింతల పంపిణీకి స్వచ్ఛందంగా రామ సేవకులు ముందుకు వచ్చారు. అందులో 5,500 మంది జిల్లాలోని 32 మండలాల పరిధిలో, అలాగే మరో 3 వేల మంది రామసేవకులు నగరంలో 5 లక్షల కుటుంబాలకు వీటిని అందజేశారు. ఆదివారంతో ఈ అక్షింతల పంపిణీ ముగిసింది.

ఊరూరా పంపిణీ..

మండలానికి నలుగురు, పంచాయతీలకు నలుగురు చొప్పున గ్రూపుగా ఏర్పడి, నగరంలో డివిజన్‌కు ఇద్ద రు చొప్పున రామ సేవకులు నడక యాత్ర చేపట్టి ఊరురా వెళ్లి అక్షింతలు, అయోధ్య చిత్రపటం అందించారు. కొంతమంది ఆటోల ద్వారా ప్రచారం చేస్తూ, అక్షింతలు అందజేశారు. మరికొంతమంది నేరుగా రామ సేవల వద్దకే వచ్చి అక్షింతలు తీసుకున్నారు.

అక్షింతలు అందుకున్న ప్రతి కుటుంబం 22వ తేదీ వరకు ఇంట్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. హనుమాన్ చాలీషా పారాయణం చేశారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ప్రతి ఇంటినీ శుభ్రం చేసుకున్నారు. ఇళ్లలో పూజా కార్యక్రమానికి సిద్ధం చేశారు.

రామ నామ విస్తరణే లక్ష్యం..



“అక్షింతల పంపిణీ కార్యక్రమం జిల్లావ్యాప్తంగా విజయవంతంగా పూర్తి చేశాం. రామ సేవకులు స్వచ్ఛందంగా వచ్చి ప్రతి ఇంటికీ అక్షింతలు అందజేశారు. స్వామి మీద భక్తితో సొంత ఖర్చులు వెచ్చించి ఊరూరా తిరిగి వితరణ చేశారు. భక్తులు బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని టీవీల ద్వారా వీక్షించి స్వామి కృపకు పాత్రులు కావాలి. రామ నామ విస్తరణే లక్ష్యం.

– ఎస్.వి.వేలు, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి

సదుమమ్మ సేవలో మంత్రి పెద్దిరెడ్డి



సదుం: పూజల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె సదుమమ్మ ఆలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం దర్శించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మంత్రి తన సతీమణి పెద్దిరెడ్డి స్వర్ణలతమ్మతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారికి ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా రాత్రి గ్రామంలో అమ్మవారి ఊరేగింపును మేళతాళాలతో ఘనంగా నిర్వహించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, కవితమ్మ, సుధీర్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, అభినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎస్పీ రిశాంత్‌రెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు గ్రౌండ్‌లో ఆదివారం జిల్లా స్పోర్ట్, గేమ్స్ మీట్–2024ను ప్రారంభించారు. బెలూన్, కాగడా వెలిగించి ఎస్పీ చేతుల మీదుగా క్రీడలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో సతమతమయ్యే పోలీస్ సిబ్బందికి మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనానికి క్రీడలు దోహదం చేస్తోందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. అథ్లెటిక్స్, టెన్నిస్, బ్యాండ్మింటన్, వాలీబాల్, కబడ్డీ పోటీలతో పాటు పలు అంశాల్లో క్రీడలు జరుగుతాయన్నారు. అనంతరం రన్నింగ్ రేస్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, నాగేశ్వర్, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పలువురు సెబ్ ఎస్ఐల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లాలో పలువురు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) విభాగానికి చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ అనంతపురం సెబ్ డీసీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు అర్బన్ ఎస్ఐ రామ్‌ప్రసాద్ సత్యసాయి జిల్లా మడకశిరకు బదిలీ కాగా, చిత్తూరు రూరల్‌లోని మోహన్‌బాబు కడప జిల్లాలోని బద్వేలుకు, కార్వేటినగరంలోని కె.భాస్కర్ అనంతపురం జిల్లా డీటీఎఫ్‌కు, బి.జయశంకర్ తిరుపతి జిల్లా చంద్రగిరికి, నగరిలోని భానుప్రకాష్‌ను సత్యసాయి జిల్లా తనకల్లుకు, పలమనేరులోని బి.రామదాసును కడప డీటీఎఫ్‌కు బదిలీ అయ్యారు. అలాగే పుంగనూరులోని అశోక్‌కుమార్‌ను తిరుపతి రూరల్‌కు, పులిచెర్లలోని కామేశ్వరనాయుడిని అన్నమయ్య జిల్లా రాయచోటి డీటీఎఫ్‌కు, వి.కోట చెక్‌పోస్టులోని రమణరాజును తిరుపతి జిల్లా పుత్తూరుకు, ఎన్ఆర్‌పేట చెక్‌పోస్టులోని వెంకటరత్నంను అనంతపురం జిల్లా కంబదూరుకు, క్యాటిల్‌ఫాం చెక్‌పోస్టులోని విజయ్‌కుమార్‌ను అనంతపురం జిల్లా కల్యాణదుర్గానికి, చిత్తూరు డీటీఎఫ్‌లోని మస్తాన్‌వలీని సత్యసాయి జిల్లా మడకశిరకు, చిత్తూరు ఇంటెలిజెన్స్‌లోని పృథ్వీరాజ్‌ను కర్నూలు జిల్లా పంచలింగాలకు బదిలీ చేశారు. అలాగే పలమనేరులోని రామ్మూర్తి కర్నూలు జిల్లా హన్మకొండకు, చిత్తూరు డీటీ డబ్ల్యూ ఎస్ఐ బాబు కర్నూలు జిల్లా సుంకేసులకు బదిలీ అయ్యారు.

ఇతర జిల్లాల నుంచి..

అనంతపురం ఎస్ఐ పవన్‌కుమార్‌ను చిత్తూరు అర్బన్ స్టేషన్‌కు, అనంతపురం జిల్లా రాయదుర్గంలోని హరికృష్ణను పుంగనూరుకు, అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలోని కృష్ణానాయక్‌ను నగరికి, అనంతపురం జిల్లా కంబదూరులోని మునస్వామిని ఎన్ఆర్ పేట చెక్‌పోస్టుకు రానున్నారు. అలాగే సత్యసాయి జిల్లా ధర్మవరంలోని సుశీలమ్మను వి.కోట చెక్‌పోస్టుకు, సీకే పల్లిలోని నాగరాజును చిత్తూరు రూరల్ స్టేషన్‌కు కడపలోని సి.భారతిని కార్వేటినగరానికి, కడప జిల్లా బద్వేలు ఎస్ఐ రూపను చిత్తూరు డీటీఎఫ్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి.

నేడు తుది ఓటరు జాబితా

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లా అధికారులు ఓటర్ల జాబితా కసరత్తు పకడ్బందీగా చేపట్టారు. గతేడాది అక్టోబర్ 10వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించారు. అనంతరం వచ్చిన అభ్యంతరాలు, కొత్త ఓటర్ల నమోదు, తదితర కసరత్తును పకడ్బందీగా నిర్వహించారు. ఓటర్ల జాబితా అబ్జర్వర్ పోలా భాస్కర్ జిల్లాలో పలుమార్లు పర్యటించి అధికారులతో, రాజకీయ పార్టీల నేతలతో సమావేశాలు నిర్వహించి కసరత్తును పర్యవేక్షించారు. సోమవారం ఓటరు తుది జాబితాను ప్రచురించేందుకు అధికార యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు సిద్ధం చేసింది.

- ప్రచురించనున్న జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ షణ్మోహన్
- పలుమార్లు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం
- ముసాయిదా ఓటరు జాబితాపై 12,591 దరఖాస్తులు
- పారదర్శకంగా కసరత్తు చేసిన జిల్లా యంత్రాంగం
- తుది జాబితా ప్రకారం జిల్లాలో 15,58,257 మంది ఓటర్లు
- అన్ని నియోజకవర్గాల్లో మహిళలే అధికం


గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న డీఆర్‌ఓ రాజశేఖర్(ఫైల్)

తుది ఓటర్ల జాబితా ఇలా

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్	ఎన్ఆర్ఐ ఓటర్లు	మొత్తం ఓటర్లు
పుంగనూరు	1,16,623	1,21,172	08	386	31	2,38,220
నగరి	98,081	1,03,358	08	140	20	2,01,607(అత్యల్పం)
జీడీ నెల్లూరు	1,01,710	1,02,918	07	745	13	2,05,123
చిత్తూరు	97,765	1,03,023	34	868	51	2,01,741
పూతలపట్టు	1,08,381	1,11,577	08	1,072	39	2,21,077
పలమనేరు	1,32,112	1,34,822	01	236	07	2,67,178(అత్యధికం)
కుప్పం	1,11,231	1,11,855	18	202	05	2,23,311
మొత్తం	7,65,903	7,88,725	84	3,379	166	15,58,257

చిత్తూరు కలెక్టరేట్ : త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న వేళ జిల్లాయంత్రాంగం ఎన్నికల నిర్వహణకు సమాయత్తమైంది. ఈ ప్రక్రియలో అతి ముఖ్యమైన ఓటర్ల జాబితా తయారీని జిల్లా యంత్రాంగం పకడ్బందీగా చేపట్టింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్ తప్పులు లేని పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. గత 6 నెలలుగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు, అధికారులను నియమించి ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కొత్త ఓటర్ల నమోదును వేగవంతం చేశారు. ఓటు ప్రాధాన్యతపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించారు. అన్ని ప్రక్రియలు పూర్తి అయ్యాక సోమవారం అధికారికంగా తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నారు.

జిల్లాలో 15,58,257 మంది ఓటర్లు..

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో తుది ఓటర్ల జాబితాను పకడ్బందీగా సిద్ధం చేశారు. ప్రస్తుతం జిల్లాలో 15,58,257 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. ఇందులో పురుషులు 7,65,903, మహిళలు 7,88,725, ఇతరులు 84, సర్వీస్ ఓటర్లు 3,379, ఎన్ఆర్ఐ ఓటర్లు 166 మొత్తం 15,58,257 మంది ఓటర్లు ఉన్నారు. గతేడాది అక్టోబర్ 27వ తేదీన విడుదల చేసిన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 15,45,666 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం మొత్తం ప్రక్రియ పూర్తి కాగా ఓటర్ల సంఖ్య 15,58,257కు చేరింది. ముసాయిదా జాబితాకు, తుది ఓటర్ల జాబితాకు 12,591 ఓట్లు పెరిగాయి. జిల్లాలోని పలమనేరు నియోజకవర్గంలో 2,67,178 (అత్యధికం), నగరి నియోజకవర్గంలో 2,01,607 (అత్యల్పం) గా ఓటర్లు నమోదయ్యారు.

అంతటా మహిళా ఓటర్లే అధికం

తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పురుష ఓటర్లు 7,65,903 ఉండగా, మహిళా ఓటర్లు 7,88,725 మంది ఉన్నారు. దీంతో పురుషుల కంటే మహిళలు 22,822 మంది అత్యధికంగా ఉన్నారు.

ప్రతి దరఖాస్తును పరిశీలించాం..



ముసాయిదా జాబితాపై ఫారం–6, 7, 8లకు సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. ఎన్నికల నిబంధనల ప్రకారం కసరత్తు పకడ్బందీగా చేపట్టాం. దరఖాస్తులను పోలింగ్ కేంద్రాల వారీగా సందర్శించి పరిశీలించడం జరిగింది. పారదర్శకమైన, తప్పులు లేని ఓటర్ల జాబితా ప్రచురణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాం. జనవరి 22న తుది ఓటర్ల జాబితా అధికారికంగా ప్రకటిస్తాం.

– షణ్మోహన్, కలెక్టర్

పకడ్బందీగా కసరత్తు



ఎన్నికల సంఘం సూచించిన ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి పకడ్బందీగా కసరత్తు నిర్వహించాం. ఎప్పటికప్పుడు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాము. ఓటర్ల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు.

– పులి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్

స్వర్ణరథం ఊరేగింపునకు దరఖాస్తు చేసుకోండి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ప్రతి సంకటహర చతుర్థి వ్రతం రోజు నిర్వహించే స్వర్ణరథం ఊరేగింపు ఉత్సవాన్ని దాతలు ముందుకు వస్తే వారి ఆధ్వర్యంలోనే నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పౌర్ణమి తరువాత నాలుగో రోజు సంకటహర చతుర్థి వ్రతం ప్రధాన ఆలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదేరోజు స్వామివారి బంగారు రథం మాడవీధుల్లో ఊరేగింపు ఉంటుందని, అయితే ఈ కార్యక్రమాన్ని ఇప్పటి వరకు ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, ఇకపై స్వర్ణరథం ఊరేగింపునకు దాతలు ముందుకు వస్తే వారి ఆధ్వర్యంలోనే నిర్వహించనున్నట్లు వివరించారు. స్వర్ణరథం ఊరేగింపు చేయాలనే దాతలు 15 రోజుల ముందు ఆలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు. దరఖాస్తులకు సీనియారిటీ ప్రకారం ప్రాధాన్యత ఇస్తామని వివరించారు.

విహార యాత్ర మిగిల్చిన విషాదం


జీవన్ చౌదరి (ఫైల్)

పెనుమూరు(కార్వేటనగరం): కుటుంబ సభ్యులతో విహారయాత్రకు వెళ్లిన ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. పెనుమూరు మండలం మనియానంపల్లికి చెందిన సుధాకర్‌నాయుడు, భవానీ దంపతుల పెద్దకుమారుడు జీవన్‌చౌదరి(31), భార్య లోకేశ్వరి, కుమారుడు ఇతర కుటుంబ సభ్యులతో కలసి పాండిచ్చేరికి విహారయాత్రకు వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో బీచ్‌లో సరదాగా ఆడుకుంటుండగా భారీ అలలు రావడంతో జీవన్ చౌదరి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు గాలించినా ఫలితం లేకుండా పోయింది. దాదాపు గంట సమయం తరువాత జీవన్‌చౌదరి శవం కొట్టుకుంటూ ఒడ్డుకు చేరింది. దీంతో జీవన్ కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ


బోయకొండ ఆలయ మెట్లు ఎక్కుతున్న భక్తులు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబుచేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, జంతు బలులు ఇచ్చి మొక్కులు చెల్లించారు. పెద్దఎత్తున భక్తులు తరలి రావడంతో క్యూలైన్లు నిండి కిటకిటలాడాయి. ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాబును నమ్మితే అరణ్యవాసమే


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

బైరెడ్డిపల్లె : చంద్రబాబును నమ్మితే మగవాళ్లకు అరణ్యవాసం, ఆడవాళ్లకు అశోక వనమే అని ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ అన్నారు. బైరెడ్డిపల్లెలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుప్పం ప్రజలు గత 30 ఏళ్లుగా చంద్రబాబును ఆదరిస్తున్నా, ఆయన మాత్రం జనాలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. 2024లో జరిగే ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా టీడీపీ నేతలు ముందుకు రావడం లేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో టీడీపీ గల్లంతు కావడం ఖాయమన్నారు. చంద్రబాబు ప్రజల వద్దకు వచ్చి మాయమాటలు, అబద్ధపు హామీలు ఇస్తాడని, ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య పింఛన్‌ను రూ.3వేలకు పెంచి ఇస్తున్న ఘనత సీఎం జగనన్నదే అన్నారు.చంద్రబాబు అవినీతిలో దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ భాగస్వామి గనుకే ఆయనను ప్రశ్నించరని దుయ్యబట్టారు.

మంత్రి పెద్దిరెడ్డితో డీకే శ్రీనివాస్ సమాలోచనలు


మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన డీకే శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి

పుంగనూరు: రాష్ట్రమంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పుంగనూరులో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డితో ప్రముఖ పారిశ్రామికవేత్త డీకే ఆదికేశవులు నాయుడు కుమారుడు డీకే శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సమాలోచనలు జరిపారు. మంత్రి పెద్దిరెడ్డిని కలసి చర్చించుకోవడం సర్వత్ర చర్చనీయాంశమైంది.

జగనన్న పాలనలోనే సామాజిక న్యాయం


పుత్తూరులో కల్యాణ మండపానికి భూమిపూజ చేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సామాజిక న్యాయం సాధ్యమని పర్యాటక సాంస్కృతిక యువజన క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆదివారం పుత్తూరులో వన్నెరెడ్డి సంఘం కల్యాణ మండపం, కమ్యూనిటీ హాలు నిర్మాణాలకు మంత్రి రోజా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలోని వన్నెరెడ్డి సంఘం చిరకాల స్వప్నమైన కల్యాణమండపం, కమ్యూనిటీహాలు నిర్మాణాల కోసం సీఎం జగనన్నను అడిగిన వెంటనే పుత్తూరు మండలం నేసనూరు రెవెన్యూ లెక్కదాఖలా, కొండలచెరువు గ్రామ పరిధిలో 1.04 ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా నగరి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి తరలివచ్చిన వన్నెరెడ్డి సంఘ నాయకులు మంత్రి రోజాను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వన్నెరెడ్డి సంఘ అధ్యక్షుడు ఏ.ఎస్.వెంకటేశన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కె.మనోహర్‌రెడ్డి, నాయకులు బాబురెడ్డి, మురళీరెడ్డి, బాలురెడ్డి, వెంకటేశురెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఏలుమలైరెడ్డి, మోహన్‌రెడ్డి, శివారెడ్డి, నాగరాజురెడ్డి, జానకిరామ్‌రెడ్డి, రామయ్యారెడ్డి, ఏకాంబరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


మాంబేడులో దూసుకుపోతున్న కోడె గిత్తలను నిలువరిస్తున్న యువత


జల్లికట్టును తిలకిస్తున్న జనం

రంకెలేసిన కోడెగిత్తలు .. దుమ్ములేపిన యువత

- పలకల కోసం పోటీ పడిన యువకులు
- జల్లికట్టు తిలకించేందుకు పెద్దఎత్తున వచ్చిన జనం

వెదురుకుప్పం: యువత కేరింతలు.. రంకెలేసిన కోడెగిత్తలు.. పలకల కోసం పోటీపడుతున్న యువత కేకలతో ఆదివారం మండలంలోని మాంబేడు గ్రామంలో జరిగిన జల్లికట్టు దుమ్ము రేపింది. సంక్రాంతి సంబరాలలో భాగంగా ఇక్కడ ఎద్దల పందేలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా నిర్వహించిన ఈ పశువుల పందేలు హోరెత్తించాయి. ముందుగా ఎద్లకు పలకలు, వస్త్రాలతో పాటు బెలూన్‌లు కట్టి పందేనికి సిద్ధం చేశారు. అంతకు ముందే వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్న యువత అల్లి వద్ద పలకల కోసం నిలబడ్డారు. పందేనికి సిద్ధం చేసిన ఎద్లను నిర్వాహకులు ఉసిగొల్పి అల్లివద్ద వదిలారు. ఈలలు వేస్తూ తరిమిన కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జనాలపై దూసుకుపోయాయి. ఎద్లను నిలువరించి పలకలు పట్టేందుకు యువత పోటీ పడ్డారు. పలకలు పట్టిన యువత తమ విజయ దరహాసంతో చిందులు వేశారు. అయితే కొన్ని ఎద్లు జన ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా యువతకు చిక్కకుండా పరుగులు తీశాయి. ఈ నేపథ్యంలో పలువురు పశువుల కింద పడి గాయాలపాలయ్యారు. ఎద్ల పందేలు కోలాహలంగా జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వారితో గ్రామం కిక్కిరిసింది. ఎద్లను పందేనికి వదులుతున్న సమయంలో యువకులు ఈలలు, అరుపులు హోరెత్తాయి.

అల్లరి మూకల అల్లర్లు..


తవణంపల్లె: ఈచనేరిలో ఎద్దులను నిలువరించేందుకు పోటీపడుతున్న యువత

దూసుకుపోతున్న కోడెగిత్తలను నివారించి పలకలు పట్టే క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. గ్రామంలో నిర్వహించిన జల్లికట్టులో టీడీపీ, జనసేనకు చెందిన అల్లరి మూకలు అల్లర్లు సృష్టించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించాల్సిన ఎద్ల పందేలు టీడీపీ, జనసేనకు ప్రచార యావగా మారడంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. చంద్రగిరి నియోజకవర్గం నుంచి గ్రామానికి వచ్చిన యువకులు వ్యవహరించిన తీరుతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈచనేరిలో పశువుల పందేలు

తవణంపల్లె: మండలంలోని ఈచనేరిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభిమానులు, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి యూత్, సర్పంచ్ ఉమామహేశ్వర రెడ్డి, ఈచనేరి యువత ఆధ్వర్యంలో ఎద్దుల పరుగు పందేలను నిర్వహించారు. చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి సుమారు 80 ఎద్దులు పరుగు పందెంలో పాల్గొన్నాయి. ఈ పందేలను తిలకించడానికి యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేశారు. పరుగులు తీస్తున్న ఎద్దులకు నిలువరించడానికి యువత ఉరకలు తీశారు. ఎద్దులు జనాల పైకి దూసుకు రాడంతో ఇద్దరికి స్వల్ప గాయాలు తగిలాయి. ఎస్ఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం పరుగు పందెంలో గెలిచిన 10 ఎద్దులకు బహుమతులను ప్రదానం చేశారు.